క్టర్‌గా వరుస ఫ్లాప్‌లతో దిగజారిపోయాడు. ప్రస్తుతం అతని పొజిషన్ బావుండలేదు. అందుకే ఒక్క 'హిట్' కోసం..ఆమెని ఆశ్రయించాల్సొచ్చింది. ఆలోచనల్లోంచి బయటపడి గాఢంగా నిట్టూర్చాడతను. "ఇండస్ట్రీలో ఎందరు హీరోయిన్‌లున్నా వాళ్లెవరూ నీకు సాటిరారు. ఆ పైన గతంలో మనిద్దరిదీ హిట్ కాంబినేషనన్న సెంటిమెంట్ కూడా ఉంది. అందుకని నువ్వొప్పుకుంటే నేను అగ్రిమెంట్ మీద సైన్ చేస్తాను" నసిగాడు.

"బట్..నాకు డేట్స్ లేవు" నిర్మొహమాటంగా చెప్పేసిందామె.

"అలా అనకు. నువ్వు కాదంటే నాకు సినిమా లేదు. అన్యాయమైపోతాను" అర్థించాడు.

మళ్లీ పగలబడి నవ్విందామె. "అదేవిటీ? నువ్వెంతో ప్రతిభావంతుడివి కదా! అసలు నేను పైకొచ్చిందే నీ ప్రతిభవల్ల. సిన్మాల్లో రాణించడానికి ప్రతిభ చాలుకదా!" అంటుంటే ఆమె స్వరంలో కావల్సినంత వ్యంగ్యం తొంగిచూసింది.

ఆ హేళనకి విలవిల్లాడిపోయాడతను. "అది కాదు..." ఏదో చెప్పబోయాడు.

కానీ వినలేదామె. పైపెచ్చు..."చాలు! ఇంక చెప్పొద్దు" అన్నట్టుగా చెయ్యెత్తి అతన్ని అడ్డుకుంది. "నీకో నిజం తెలుసా? నువ్వు హిట్ డైరక్టర్‌వి కావడానికి కారణం అదృష్టమైతే...నేను హిట్ హీరోయిన్ని అవ్వడానికి కారణం లౌక్యం! ఇక్కడ అసలు ప్రతిభ ప్రసక్తి లేనే లేదు. అసలా మాటకొస్తే ఎంచుకున్న రంగంలో అప్రతిహతంగా రాణించాలంటే అందుకు ప్రతిభ ఒక్కటే చాలదు. ఇంకా చాలా కావాలి. కాలం, అదృష్టం, అవకాశం, ఇచ్చిపుచ్చుకోవడం...ఇవన్నీ ఆ 'చాలా' కోవలోనికే వస్తాయి. గుర్తుంచుకో!" చెప్పేసి అక్కణ్నుంచీ వెళ్లిపోయిందామె.

అప్పుడర్థమైందతనికి. 'ప్రతిభ పక్కన లౌక్యం లేకపోతే రాణింపు కష్టమని'!

**-ఎ.హేమంత (హైదరాబాద్)**

# ఎంపిక

**"ఒరేయ్ అబ్బాయ్ గోవిందూ... ఇంకా ఎన్నాళ్లు తాత్సారం చేస్తావురా. తొందరగా ఏదో ఒకటి తేల్చరా..." రుక్మిణమ్మ ఆఫీసు నుంచి వచ్చిన గోవిందుకి మంచినీళ్లు, టిఫిన్ అందిస్తూ అంది.**

''అమ్మా ఇలాంటి విషయాల్లో తొందరపడకూడదు. కాస్త ఓపికపట్టు. నాలుగు చోట్లా చూసి సెలక్ట్ చేసుకుందాం. నిదానించాలి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు కాకూడదు. నాలుగు విషయాలూ ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి'' పకోడీలు నోట్లో వేసుకుంటూ అన్నాడు గోవిందు.

''ఏంటో... నువ్వేమో అన్నింటికీ ఇలా నానుస్తావు. మీ నాన్నగారే ఉండి ఉంటే ఓ నిమిషంలో ఏదో ఒకటి తేల్చేసేవారు.''

''అబ్బా అంత కంగారు ఏమిటమ్మా..''

''కంగారేమిట్రా...ఆరు నెలల నుంచీ ఇదిగో అదిగో అంటున్నావు. ఏదీ తేల్చవు. అందరూ అడగడమే... ఇంకెప్పుడూ అంటూ. నలుగురిలో తలకొట్టేసేట్టుగా ఉంటోంది. ఇంకా మీ సెలక్షన్ ఎన్నాళ్లూ అంటూ వెక్కిరింతలొకటి..''

''నవ్విన నాప చేనే పండుతుంది. నవ్వనీ...ఈ అమ్మలక్కలందరూ కుళ్లుకునేలా సెలక్ట్ చేద్దాం.''

''అదే...ఎప్పుడదీ?'' రుక్మిణమ్మ దీర్ఘం తీసింది.

''ఇప్పుడేగా ఇంటికి వచ్చాను. ఇవ్వాళ ఇంటర్నెట్‌లో ఏమైనా మంచివి ఉన్నాయేమో చూస్తాను.''

''పొద్దున్న శ్రీనివాసు కొన్ని ఫోటోలు ఇచ్చి వెళ్లాడురా...ఇవిగో వీటిని చూడు.'' రుక్మిణమ్మ కొన్ని ఫోటోలు గోవిందు చేతికి అందించి తనూ ఓ కుర్చీ లాక్కుని గోవిందు పక్కనే కూర్చుంది.

గోవిందు ఒక్కో ఫోటో తీసి పరీక్షగా చూస్తుంటే రుక్మిణమ్మ ఒక్కోదాని గురించీ బ్యాక్‌గ్రౌండ్ వివరిస్తోంది.

''ఈ ఫోటో నాకు చాలా నచ్చిందిరా. తెల్లగా ఎంత అందంగా ఉందో.. పక్కవీధిలోనే వాళ్లిల్లు. ఫోన్ చేసి వాళ్లు ఉన్నారంటే ఈరోజే వెళ్లి చూసి రావచ్చు.''

''ఇల్లు పక్కవీధిలోనే ఉంది కదా అని పిల్లని ఇంట్లోకి తెచ్చుకుంటామా ఫర్వాలేదు...బాగానే ఉందనుకో...పోనీ పెండింగ్‌లో పెడదాం...''

''ఈ ఫోటో చూడు...కాస్త నలుపే అనుకో...అయినా మొహం కళగా ఉంది.''

''ఊరుకోమ్మా...నా మొహంలా ఉంది. ఏం కళ ఉందనీ...అయినా నలుపంటే నాకు ఎలర్జీ''

''నలుపు పనికిరాదు...తెలుపు తెస్తోడు తోంది అంటావు. నీతో చచ్చేచావుగా ఉందిరా. పోనీ ఇది చూడు...తెలుపు కాదు...నలుపూ కాదు మధ్యస్థంగా...''

''మరీ పొట్టిగా ఉందమ్మా.''

''ఇది...''

''అసలు జుట్టే లేదు''

''ఇదో...''

''అయ్యబాబోయ్..పర్వతంలా ఉంది... చూస్తేనే భయమేస్తోంది''

''ఇది చూడు దీనికి తిరుగులేదురా...నాకెంతో నచ్చింది...నీకూ నచ్చుతుంది.'' రుక్మిణమ్మ ఉత్సాహంగా ఇంకో ఫోటో అందించింది.

''మొహంమీద అదీ నుదుటిమీద ఛండాలంగా మచ్చ... నాకేం బాగోలేదు.''

''ప్రతీ దానికీ వంకపెడ్తావురా...ఇంతకీ నీకెలాంటిది కావాలి'' రుక్మిణమ్మ విసుగ్గా అంది.

''కాస్త చూడచక్కగా...చలాకీగా ఉండాలి కదమ్మా...నీ పక్కన నడుస్తోంటే అందరూ 'ఓహో' అనుకునేట్టు ఉండాలి'' గోవిందు కళ్లు అరమూసుకుని ఊహాలోకాల్లోకి వెళ్లిపోతూ అన్నాడు.

''మన శేఖర్ వాళ్లింటి పక్కింట్లో ఒకటి ఉంది...నీకు తప్పకుండా నచ్చుతుంది...ఇప్పుడే ఓసారి వెళ్లి చూసి వద్దాం''

''ఈరోజు మంగళవారం...వారం, వర్జ్యం చూసుకోకుండా...ఏమిటమ్మా మరీ లేడికి లేచిందే పరుగు అన్నట్టు''

''నీ చాదస్తాలతో చస్తున్నానురా...ఇహ నా బతుకింతే...నేను బతికుండగా నీకు ఏదీ నచ్చదు'' రుక్మిణమ్మ కళ్లల్లో నీళ్లు ఉబికి వచ్చాయి.

''ఏంటమ్మా ఇది...మరీ చిన్నపిల్లలా...రెండ్రోజులు టైమియ్యి...కానీ ఫ్రెండ్స్ కూడా ఏవో ఉన్నాయన్నారు. అన్నీ చూసి ఏదో ఒకటి సెలక్ట్ చేసుకుందాం''

''ఆ సుబ్బాయమ్మ...సోరెమ్మా రోజూ సాయంత్రం షికారుకెళ్తూ ఎలా గీరగా చూస్తారో'' రుక్మిణమ్మ విచారంతో పాటు కాస్త అసూయ కలగలిపిన కంఠంతో అంది.

''ఏమండీ అత్తయ్యగారు అంతలా ఇదయిపోతోంటే త్వరగా ఎందుకు తేల్చరు...ఈ ఫోటోలో బుజ్జిముండని చూడండి ఎంత బావుందో తెల్లగా...మంచులా...ఎంత ముద్దుగా ఉందో...నాకూ, అత్తయ్యగారికీ ఇద్దరికీ నచ్చింది. దీని బొచ్చు చూడండి దట్టంగా పట్టులా ఎంత బావుందో...ఇదే ఫైనల్ చేసెయ్యండి శేఖరన్నయ్య ఇంటికి వెళ్లినప్పుడు చూశాం. మాకు నచ్చింది. శేఖరన్నయ్య మంచి జాతి అని సర్టిఫై చేశాడు కూడా. నేనూ అత్తయ్యగారు దీనికి పేరు కూడా సెలక్ట్ చేసి పెట్టాం. ప్రీతి అని'' గోవిందు భార్య హిమ ఆల్బమ్ లోంచి శేఖర్ కొడుకు పుట్టినరోజు ఫోటో ఒకటి తెచ్చి చూపిస్తూ అంది.

''సరే మరి... అత్తాకోడళ్లిద్దరూ ఒకటైతే ఇంక నా మాటేం చెల్లుతుంది. రేపు వెళ్లి తెచ్చుకుందాం..సరేనా?'' గోవిందు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. తెల్లటి బొచ్చుకుక్కతో సాయంకాలం...సోరెమ్మా, సుబ్బాయమ్మా ఈర్ష్యగా చూస్తుండగా షికారు వెళ్తున్నట్టు ఊహించుకుంటున్న రుక్మిణమ్మ మొహం చాటంత అయింది.

**-చిట్టిపెద్ది ఉమ (సూరత్)**